సకల శుభాలకు నాంది ఉగాది

మార్కాపురం: ఉగాది ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని అధికారులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలకు ఉగాది శుభకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ తెలుగు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

దర్శి టౌన్: సకల శుభాలకు నాంది ఉగాది..అని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణు గోపాల్ అన్నారు. షడ్రుచుల సమూహారం ఉగాదని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, సంతోషంతో ప్రజలు పండగ జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

మార్కాపురం: భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తునట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి షేక్ రజాక్ తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. యువత రక్తదానం చేయాలని కోరారు.

లోక కల్యాణం కోసం గాయత్రి యజ్ఞం



గాయత్రి యజ్ఞం చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: లోక కల్యాణం కోసం గాయత్రి యజ్ఞం చేస్తున్నట్లు వేమన సేవా సమితి అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి అన్నారు. గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్‌లోని గాయత్రి మాత ఆలయం ఆవరణలో మంగళవారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

31 నుంచి ఏ-1 కాలేజీలో గ్లోబల్ మహోత్సవ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న షంషేర్ అలీబేగ్

మార్కాపురం టౌన్: స్థానిక ఏ–1 గ్లోబల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జాతీయ గ్లోబల్ మహోత్సవ్ నిర్వహించనునట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కాలేజీ చైర్మెన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ తెలిపారు. మంగళవారం కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. టెక్నికల్ ఈవెంట్స్, కల్చరల్ ఈవెంట్స్, గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

434 పొగాకు బేళ్ల కొనుగోలు

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి రైతులు మంగళవారం 434 బేళ్లు తీసుకురాగా 383 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 51 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.185, సగటు ధర రూ.197.53 పలికిందని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు.

పోషక లోపం నివారణకే రాగి జావ



మార్కాపురంలో రాగిజావ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ, అధికారులు



త్రిపురాంతకంలో రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, అధికారులు



దర్శి: విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న సోము దుర్గారెడ్డి



బేస్తవారిపేట: రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మెన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు, ఎంఈఓ రాందాస్‌నాయక్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాగిజావ అందజేస్తోందన్నారు. కమిషనర్ గిరికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీని ఎంఈఓ ఈవీ రంగయ్య, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి తదితరులు ప్రారంభించారు.

కొనకనమిట్ల : చినారికట్ల జెడ్పీ హైస్కూల్లో రాగి జావ అందించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, ఎంఈఓ డాంగే షరీఫ్, హెచ్‌ఎం కోటిరెడ్డి పాల్గొన్నారు.

దర్శి: పొతకమూరు జెడ్పీ హైస్కూల్లో రాగిజావ పంపిణీని వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి ప్రారంభించారు. రోజూ రాగి జావ తాగి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

ముండ్లమూరు: స్థానిక హైస్కూల్లో రాగిజావ పంపిణీని ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, ఎంఈఓ జి. చంద్రమోహన్, హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.

తాళ్లూరు: మండల కేంద్రంలోని పాఠశాలల్లో రాగి జావ పంపిణీని ఎంఈఓ జి.సుబ్బయ్య, సర్పంచి మేకల చార్లెస్ సర్జన్, పీఎంసీ కమిటీ చైర్మన్ కోటిరెడ్డి ప్రారంభించారు. మండలంలో 3778 మంది విద్యార్థులకుగాను 2895 మంది విద్యార్థులు మంగళవారం రాగి జావ తాగినట్లు ఎంఈఓ సుబ్బయ్య తెలిపారు.

కురిచేడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ప్రారంభించారు. ఎంపీడీఓ వసంతరావు నాయక్, ఎంఈఓ వస్త్రాంనాయక్, ఈఓఆర్డీ నరేష్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎన్వీ నాగిరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు రాగిజావ తాగేందుకు గ్లాసులను నాగిరెడ్డి ఏర్పాటు చేశారు. పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.10116 ప్రోత్సాహక బహుమతిని ఆయన ప్రకటించారు.

యర్రగొండపాలెం: జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో పి.ఆంజనేయులు ప్రారంభించారు. హెచ్‌ఎం శామ్యూల్ జాన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీని జెడ్పీటీసీ సభ్యురాలు దుమావత్ లతాబాయి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఎంఈఓ మస్తాన్‌నాయక్ పాల్గొన్నారు.

పుల్లలచెరువు: విద్యార్థులకు పౌష్టికర ఆహారం అందించే ఉద్దేశంలో భాగంగా మంగళవారం నుంచి రాగి జావ పంపిణీ చేస్తున్నట్లు స్థానిక జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. పుల్లలచెరువు ఎస్సీ పాలెంలో ఎంపీటీసీ రాములు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

త్రిపురాంతకం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఎంపీడీఓ మరియదాస్, ఎంఈఓ తులసీమల్లికార్జున నాయక్, సర్పంచ్ పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, ఏనుగులదిన్నెపాడు, సుంకేసుల, తోకపల్లె, మద్దలకట్ట, కలనూతల తదితర జెడ్పీహెచ్ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ సర్పంచ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్‌లు జిల్లెల మల్లేశ్వరి, దుగ్గెం చెన్నమ్మ, గుడ్డెపోగు రమేష్, బలుసుపాటి లూథియా, హెచ్‌ఎంలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కంభం: బడి పిల్లలకు పౌష్టికాహారమే పరమౌషధమని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, కందులాపురం సర్పంచి బత్తుల తిరుపాలమ్మ(రజని) అన్నారు. కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఎంఈఓ మాల్యాద్రి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్లో రాగిజావ పంపిణీని జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షుడు డి.ఖాజా మీయా, సర్పంచ్ తంగ్రి బుద్దుల ప్రేమానంద్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ఎంపీపీ పాఠశాలలో రాగి జావ పంపిణీని జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీ సుభానీ, నాయకులు నాదెళ్ల పెద్దసుబ్బరాయుడు, కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలపై దాడి సిగ్గుచేటు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు మురారి, ఇస్మాయిల్

మార్కాపురం: రాష్ట్ర శాసన సభలో స్పీకర్, వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యేలపై టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి దాడి చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మురారి వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి క్యాంప్ కార్యాలయంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలపై దాడి ఘటనను శాసనసభ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. దాడికి పాల్పడిన ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్, డి.బాబి, సీహెచ్ శ్రీనివాసులు, బూదాల సతీష్, డి.కొండలు, దేవెండ్ల పెద్దమల్లయ్య, సుస్మిత భూషణకుమారి, కూరాటి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.16.92 కోట్లు

యర్రగొండపాలెం: పనుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పథకం కింద గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన పనులకు రూ.16.92 కోట్లు కూలీల అకౌంట్‌లో జమ చేసినట్లు ఏపీవో కందుకూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఆవాస గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు 100 రోజులు పనులు పూర్తి చేసిన వారికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి తిరిగి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మండలంలో మొత్తం 18,600 జాబ్ కార్డులు ఉన్నాయని, వాటిలో 15848 జాబ్ కార్డు దారులు పనులు చేస్తున్నారని చెప్పారు. మండలంలో 1900 సింగిల్ జాబ్ కార్డులు ఉన్నాయని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ నుంచి ఆ జాబ్ కార్డులు తొలగించి కుటుంబానికి ఒక జాబ్ కార్డు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మత్స్య వర్శిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలి



మంత్రి సీదిరి అప్పలరాజుతో మాట్లాడుతున్న బెల్లంకొండ శ్రీనివాసరావు

పొదిలి: ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వ విద్యాలయానికి రెగ్యులర్ వీసీని నియమించాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు కోరాయి. వర్శిటీ అనుబంధ ఫిషరీస్ పాలిటెక్నిక్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్య బృందం మంగళవారం విజయవాడలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబును కలిసి వినతి పత్రం అందించారు. బిట్స్ కళాశాల చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాసరావు, వాయల విజయ రత్నం, విజయకుమర్ తదితరులు ఉన్నారు.

నేడు వెంకట్రామయ్యస్వామి తిరునాళ్ల

తాళ్లూరు: తాళ్లూరులో వెంకట్రామయ్యస్వామి తిరునాళ్లను బుధవారం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ ఏటా శివ రాత్రి, తదనంతరం ఉగాది రోజు ఉత్సవాలు జరుపుతుంటారు. ప్రస్తుతం 86వ వార్షిక ఉత్సవాల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్వం తాళ్లూరు గ్రామ పంచాయతీ వ్యవస్థాపకుడు నెల్లూరు జిల్లా జమీందారీ రైతు సంఘ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన ఇడమకంటి వెంకట్రామిరెడ్డి జమీందార్ చిన కోటిరెడ్డి కుమారుడు. ఈయన తత్వవేత్తగా ఉంటూ ప్రజలకు కాలజ్ఞానాన్ని బోధించేవారు. పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించేవారు. రైతుల కోసం రజానగరం పంట కాలువను నిర్మించి సాగు నీటి వసతిని కల్పించారు. ఇక్కడి ప్రజలకు ఆయనపై అపార నమ్మకం ఉంది.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న యువ కేర్ సొసైటీ సభ్యులు

మార్కాపురం: పట్టణంలోని గడియార స్తంభం సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వృద్ధుడు(65) మృతి చెందాడు. హోంగార్డ్ చెన్నుపల్లి కాశయ్య సమాచారం మేరకు పట్టణ ఎస్సై శశికుమార్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ పరిశీలించి యాచకునిగా గుర్తించారు. యువ కేర్ సొసైటీ అధ్యక్షుడు అరీఫుద్దీన్ ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛత అవార్డులకు ఈ నెల 24లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ గిరికుమార్ మంగళవారం తెలిపారు. పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందిస్తామన్నారు.

స్పీకర్‌పై టీడీపీ వికృత చేష్టలు అమానుషం



విలేకరులతో మాట్లాడుతున్న పుల్లలచెరువు వైఎస్సార్ సీపీ నాయకులు

పుల్లలచెరువు: అసెంబ్లీ స్పీకర్‌పై శాసనసభలో టీడీపీ సభ్యులు ప్రవర్తించిన తీరు అమానుషమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రాములు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. శాసన సభలో టీడీపీ సభ్యులు ప్రవర్తించిన తీరు కేవలం ఎస్సీ సామాజికవర్గాల సభ్యుల మధ్య చిచ్చుపెట్టేలా చంద్రబాబు ఆడుతున్న నాటకమని పేర్కొన్నారు. అలజడులు సృష్టిస్తే టీడీపీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఎంపీటీసీ వెంకటయ్య, రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ మాజీ జిల్లా డైరెక్టర్ సుబ్బారెడ్డి, నాయకులు గంగరాజు, దానియులు, కాశయ్య, గురువయ్య, సుందరరావు, మూర్తెయ్య, వెంకటరెడ్డి, అంజనేయులు, ఈశ్వరరెడ్డి, ఏడుకొండలు, ప్రసాద్ పాల్గొన్నారు.

25న మెగా మల్టీ మెడికల్ క్యాంప్

దర్శి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న మెగా మల్టీ మెడికల్ క్యాంప్‌ను పట్టణంలో ఏర్పాటు చేస్తున్నట్లు రోటరీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. రోటరీ సెక్రటరీ రెడ్డిమాసు శ్రీనివాసరావు, ట్రెజరర్ కర్నా రమణారెడ్డి, రోటరీ సభ్యులు డాక్టర్ కోటిరెడ్డి, మారం శివ కోటిరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో బొల్లావుల సందడి

పెద్దారవీడు: ఉగాది సందర్భంగా వేనూతల కాటంరాజు ఆలయంలో మొక్కులు చెల్లించేందుకు బయలుదేరిన భక్తులతో గ్రామాలో సందడి వాతావరణం నెలకొంది. యాదవులు తమ కులదైవం కాటంరాజు గుడికి వెళ్లే ముందు బొల్లావులతో ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. బొల్లావులను ఎత్తుకుని కొమ్ముబూర, డప్పుల చప్పుళ్లకు అనుగుణంగా వీరతాళ్లతో చిందులు తొక్కేందుకు యువత, పెద్దలు పోటీపడ్డారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న సీఐ రాజేష్, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: స్థానిక కందులాపురం కూడలిలో మంగళవారం యోగివేమన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాటంరాజుకు వెళ్లే భక్తుల కోసం మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. సీఐ ఎం.రాజేష్ కుమార్, ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, నారాయణరెడ్డి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, నరాల ఈశ్వరరెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అర్ధవీడు రోడ్డులో మజ్జిగ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, పులి శ్రీనివాసప్రసాద్, హెచ్‌ఎం బీవీ రామకృష్ణ, హజరత్ గూడెం సర్పంచ్ మహబూబ్ పీరా పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి తిరునాళ్ల



హోమగుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు పంచాయతీలో ముసి ఏరు బ్రిడ్జి వద్ద అభయాంజనేయస్వామి, వరసిద్ధి వినాయకస్వామి 13వ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ, 8 నుంచి 12 గంటల వరకు హోమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఉలవా గోపి, కాశినాయన నిత్యాన్నదాన సత్రం. పలువురు దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానంతోపాటు ప్రసాదాలు అందజేశారు. ధర్మవరపు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పొదిలి సీఐ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఎస్సై మల్లికార్జున్, 20 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. తిరునాళ్ల నిర్వహణను ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, ఈఓఆర్డీ రాజశేఖర్ పర్యవేక్షించారు.